
# నీలి మంట



"ఆ బొమ్మ చాలా బాగుంది కదూ?"

గోడకు తగిల్చి ఉన్న అందమైన బొమ్మవంకచూస్తూ అన్నాడు రాజన్.

సుశీల్ సిగరెట్టు పొగ గాలిలో వదులుతూ నిర్లక్ష్యంగా నవ్వాడు. సుశీల్ అలా నవ్వితే, అందులో ఏదో విశేషం ఉందన్నమాట!

"ఏం? నీ కా బొమ్మ నచ్చలేదా?" అన్నాను నేను ఆ బొమ్మ వైపు చూస్తూ.

గోడకు తగిలించిన చిత్రంలోని అతివ అతి అందంగా ఉంది. తడిసిన చీరలోంచి ఆమె అవయవాలలోని ఒంపులు సొంపులు చక్కగా ప్రస్ఫుటింపచేస్తూ గీసిన చిత్రం అది.

"ఈ బొమ్మలో ఏముంది? ఇంతకంటె వెయ్యిరెట్లు అందంగా

ఉన్నస్త్రీనే చూశాను నేను!" సుసీల్ మెత్తగా కనురెప్పలు మూసుకుంటూ అన్నాడు.

"కంట్రోలురూము" హాయిగా, అతి వెచ్చగా ఉంది. విద్యుద్దీపాల కాంతిలో "పేనెల్ బోర్డు" తళతళలాడుతూంది. "బాయిలర్" లోని వేడి, ఒత్తిడి అన్నీ సవ్యంగా ఉన్నాయని సూచిస్తూ పచ్చకన్ను నిబ్బరంగావెలుగుతూంది. ఆవిరి ఉష్ణోగ్రతను చూపించే ఎర్రముల్లు ఇటూ అటూ వింతగా కదులుతూంది.

బయటి "షెడ్డు" అంతా దీపాలకాంతిలో పట్టపగలులా కనిపిస్తూంది. గంధకపు కొలిమికి అమర్చిన గుండ్రని అద్దాలలోంచి లోని మంటలు నీలం రంగులో కనిపిస్తున్నాయి. దూరంగా పాలదీపాల తెల్లిపెలుగులో పచ్చని గంధకపురాశి సాక్షాత్కరించిన మేరువులాఉంది. గంధకం మరుగుతున్న ప్రదేశంనుండి తెల్లని పొగలు లేచి బరువుగా గాలిలో కదులుతున్నాయి. కంట్రోలురూము వెనకవైపున ఉన్న యంత్రాల చప్పుడు సముద్ర ఘోషలా చెవులకు వినిపిస్తూంది. సల్ఫ్యూరిక్ ఆసిడ్ ఫాక్టరీలో యంత్రాలన్నీ సవ్యంగా నడుస్తూ ఉంటే అక్కడ పనిచేసే "ఆపరేటర్ల" కు బొత్తిగా పని ఉండదు. అందువలననే వేడివేడి కాఫీ వెచ్చదనాన్ని చప్పరిస్తూ మేం నలుగురం కబుర్లలోకి దిగాం.

సుసీల్ ఏడాది క్రితం బెంగాల్ నుండి ఈ కంపెనీకి వచ్చాడు. అతని బాల్యం చాలావరకూ ఆంధ్రలోనే గడపటంవలన అతడు తెలుగు చక్కగా మాట్లాడగలడు. చలాకీగా కబుర్లు చెప్తుతూ, ఎల్లప్పుడూ అతి హడావుడిగా కనిపిస్తాడు. నుదిటిమీదపడి గెలములువేసే ఉంగరాల ముంగురులతో ఎల్లప్పుడూ నున్నగా ఉండే గెడ్డంతో అతడు అతి ఆకర్షణీయంగా ఉంటాడు. సుసీల్ బెంగాలీలో అనేక పత్రికలకు ఎన్నో కథలు వ్రాసి మంచి పేరు తెచ్చుకున్న రచయిత. సంఘటనలను, ఊహలను చక్కగా పేర్చి, ఆసక్తి కలిగించే ధోరణిలోకబుర్లు చెప్పగలడు. అందుకే అతనితో "షిఫ్టు" ఎనిమిది గంటలూ ఎనిమిది నిమిషాల్లా గడిచిపోతుంది.

రాజన్ తమిళుడు. అతని తాతగారి కాలంనుండి వాళ్ళ కుటుంబం ఆంధ్ర ప్రాంతంలో స్థిరపడిపోయింది. రాజన్ ప్రకృతి ఆరాధకుడు. అందాన్ని చూసి ఆనందించగల మనిషి. మంచి మనసున్నవాడు. మేం ముగ్గురం మొదటినుండి ఒకే షిఫ్టులో పనిచేయటంవలన అతిసన్నిహితుల మయ్యాం.

మేం ముగ్గురంకాక, మాతో ఉన్న నాలుగో వ్యక్తిపేరు సుధాకర్. ఇతడు నెల్లూరు ప్రాంతంవాడు. కొంతకాలం క్రితంవరకూ ఉత్తరాదిని ఏదో ఎరువుల కంపెనీలో పనిచేశాడు. పదిహేను దినాల క్రితమే మా ఫ్యాక్టరీలో చేరాడు. మాట్లాడేది తక్కువే అయినా నవ్వుతూ ఆత్మీయంగా పలకరించేవాడు. ఈ పదిహేను దినాలనుండి మా కబుర్లమధ్యలో అతడు కేవలం శ్రోతగా మాత్రమే మిగిలిపోతున్నాడు.

గోడకు ఉన్న గడియారంలోని ఎర్రని సెకన్లముల్లు యాంత్రికంగా కదులుతూంది. టైము పదిగంటల నలభై నిమిషాలయింది. సాయంకాలం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే ఈ షిఫ్టు రాత్రి పన్నెండు గంటలతో ముగుస్తుంది. అంటే, మేం ఇంకా గంటా ఇరవై నిమిషాలు గడపాలన్న మాట.

సునీల్ సిగరెట్టు ఆఖరిపీల్పు పీల్చి బూటుకింద నలిపేశాడు. తరవాత జేబులోనుండి ఒరువయిన పర్సు బయటకు లాగాడు. అందులో ఒక అరలోంచి గులాబీరంగు కవరు తీశాడు.

"ఈ ఫోటో చూడండి!" అంటూ కవరు మడతల మధ్యలోని ఫోటో నా కందించాడు. ఫోటోతోబాటు ఖరీదయిన సెంటువాసన బయటకు వచ్చింది. మూడు రంగులలో ముచ్చటగా ఉంది ఆ ఫోటో. పాలదీపాల కొంతి దానిమీదపడి వింతగా మెరిసింది. అతిలోకసౌందర్యవతిలా ఉంది ఆ ఫోటోలోని స్త్రీ. మేం ముగ్గురం చూసి తిరిగి దానిని సునీల్‌కి అందించాం. సునీల్ దానినిపర్సులో భద్రపరుస్తూ, "మీకోకథ చెప్పుతాను, వింటారా?" అన్నాడు.

"నీలాటి ప్రఖ్యాత రచయిత కథ చెబుతానంటే, వినకుండా ఎలా ఉంటాం?" అన్నాడు రాజన్. సునీల్ ప్రారంభించాడు.

* * *

"నేను ఇక్కడికి రావటానికి ముందు కలకత్తాలో ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేశాను. కిడర్‌పూర్ ప్రాంతంలో మా మామయ్యకు ఒక మేడ ఉండేది. ఆ మేడపైద ఒక గదిలో నేను ఉండేవాడిని. ఆఫీసునుండి వచ్చాక స్నానంచేసి, సాయంకాలమంతా ఆ గదిలోనే కూర్చుని సిగరెట్లు తాగుతూ కాలం గడిపేవాడిని. ఆ గది కిటికీలోంచి కిడర్‌పూర్ బజారు లగాయితు సినిమాహాలు వరకూ అంతా స్పష్టంగా కనిపించేది.

ఒక దినం యథాలాపంగా చూస్తూవుంటే, ఒక అమ్మాయి మా మేడపైపే వస్తూ కనబడింది. చలాకీగా నడుస్తూ, గేటు తలుపులు తెరుచుకొని పోర్టికోలోకి వచ్చింది. నేను గదిలోంచి బయటకు వచ్చి మెట్లుదిగి, వీధి వరండాలోకి వచ్చాను. నన్నుచూసి సందేహిస్తూ ఆమె ఆగింది. రెండు క్షణాలసేపు రెప్పార్పకుండా ఆమెపైపే చూస్తూ ఉండిపోయాను నేను. ఆ సమయంలో మీరు ఫోటోలో చూడలేని ఎన్నో అందాలు ఆమెలో చూశాను. కాచిన బంగారువన్నె దేహచ్ఛాయ, మన్మథుని వింటి వంపులా వున్న కనురెప్పల రెపరెపలు, ఏ కెమేరాకూడా తనలో ఇముడ్చుకొని ముద్రించలేని చిరునవ్వు; చూస్తూ నా చూపులు మరల్చుకోలేకపోయాను! ప్రశాంతమయిన కొలనులోకి గులకరాయి విసిరితే లేగే అలల తాకిడికి కంపించిపోయే పద్మాల సౌందర్యం. సుప్రభాత సమయంలో కురిసిన మంచులో తడిసిన గులాబుల ముగ్ధత్వం—ఇలాటి అందాలన్నీ నా క్షణంలో గుర్తుకు వచ్చాయి. ఆమె చిన్నగా దగ్గి, తన ఉనికిని సూచించటంతో మళ్ళీ ఈ లోకంలో పడ్డాను.

ఆమె చూడటానికి తెలుగు అమ్మాయిలా అనిపించింది. నా అనుమాన నివృత్తికోసం "ఎవరు కావాలి?" అన్నాను తెలుగులో. నేను తెలుగులో మాట్లాడగానే సంతోషంతో ఆమె ముఖం విప్పారింది. విస్మయంతో

ఆమె నేత్రాలు చక్రాల్లా అయ్యాయి. నుదుటిమీదపడి అల్లరి చేస్తున్న ముంగురులను కొనగోటితో ఎగమీటుతూ అడిగింది. "ఈ ఇంట్లో అద్దెకు ఏమయినా గదులు ఖాళీ ఉన్నాయా?"

ఆ ప్రశ్నతో నా ఉత్సాహం చచ్చుబడిపోయింది. మేడమీది రెండు గదుల్లోనూ ఒకదానిలో నేను ఉంటున్నా. రెండోదానిలో పాతసామాన్లు పడివున్నాయి! మామయ్యకు గదులు అద్దెకు ఇచ్చే అలవాటులేదు. కాని, ఆ అమ్మాయికి గది ఖాళీలేదని చెప్పటానికి నాకు మనస్కరించలేదు. లోనికి దారితీస్తూ అన్నాను: "లోపలికి రండి!"

ఆమె నన్ను అనుసరించి లోనికి వచ్చి సోఫాలో కూర్చుంది. ఆమె కెదురుగా ఉన్న సోఫాలో కూర్చుంటూ అన్నాను! "మీ పేరు?" అంతకంటే సంభాషణ ఎలా ప్రారంభించాలో కూడా నాకు అర్థం కాలేదు.

"రాధ" హేండ్‌బ్యాగ్‌లోంచి రుమాలు తీసి ముఖం అద్దుకుంటూ అంది. "ఇక్కడ ఒక రంగులు తయారుచేసే కంపెనీలో నాకు ఉద్యోగం దొరికింది. నేను ఆంధ్రయూనివర్సిటీలో ఎమ్మెస్సీ పాసయ్యాను. నిన్ననే మొదటిసారిగా కలకత్తాలో అడుగు పెట్టాను. ఈ ప్రాంతంలో తెలుగు కుటుంబాలు ఎక్కువగా వున్నాయని విని, ఇక్కడకు గదికోసం వచ్చాను మిమ్మలను చూసి బెంగాలీలని అనుకున్నాను. కాని, మీరు తెలుగువారని తెలియగానే ప్రాణం లేచివచ్చినట్లయింది.

నేను చిరునవ్వుతో అన్నాను! "చూశారా? మీ అంచనా తప్పుఅయిపోయింది. నేను బెంగాలీనే! నా బాల్యం అంతా ఆంధ్రలో గడపటంవలన తెలుగు బాగా వచ్చును!" మీ ఉచ్చారణ అచ్చం తెలుగువారికి మల్లేనే ఉంది!" అంది ఆశ్చర్యంతో. తరువాత రెండు నిమిషాలు మా మధ్య నిశ్శబ్దం ఆవరించింది. నేను అసలు కార్యక్రమంలోకి దిగుతూ అన్నాను! ఈ ఇంట్లో మేడమీద ఒక గదిలో నేను ఉంటున్నా. రెండోగది ఖాళీగానే ఉంది. కాని దానిని అద్దికిచ్చే అలవాటు ఇంతవరకూ ఈ ఇంట్లోలేదు. ఆ గది మీకు అన్నివిధాలా సౌకర్యంగా ఉంటుందని నేను అనుకుంటున్నాను.

కాని ఆ గది మీకు దొరకాలంటే మనం చిన్న నాటకం ఆడాలి. ఇంతకు ముందు విశాఖపట్నంలో వుండేటప్పుడు మీరు నాకు అత్యంత ఆప్తులనీ, మనం ఇద్దరం కలిసి చదువుకున్నామనీ మా అత్తయ్యతో చెబుతాను. అద్దె కోసం కాకపోయినా, నామీద ఉండే గౌరవంకొద్దీ వాళ్ళు మీకాగది ఇవ్వొచ్చు. కాబట్టి మీరు నాతో ఎంత చనువుగా మెలిగితే వాళ్ళకు అనుమానం కలగదు!"

ఆమె నా కళ్ళలోకి అదోలా చూస్తూ, "అలాగే!" అంది.

"ఆఁ! చూశారా? మరిచిపోయాను, నా పేరు సునీల్!" అనినన్ను నేను పరిచయం చేసుకొని, తరవాత అత్తయ్యను తీసుకువచ్చి ఆమెను పరిచయం చేశాను.

అత్తయ్య అంతా విని ఆమెకు గది అద్దెకు ఇవ్వటానికి అంగీకరించింది. నా సంతోషానికి అవధుల్లేవు. మామయ్యను ఒప్పించే భారం కూడా ఆమే వహించింది.

ఆ మరుసటి దినం సామాన్లతోసహా రాధ మేడమీది గదిలో దిగింది.

"కలకత్తాలో ఇంత మంచి గది సంపాదించగలనని కలలోకూడా అనుకోలేదు! మీకు నేను ఎంతో ఋణపడి ఉంటాను" అంది ఆ సాయంత్రం.

నా కనులలోకి కృతజ్ఞతాపూర్వకంగా చూసిన ఆమె చూపులకి మై మరచిపోయాను. "అది మీ అదృష్టం!" అన్నాను. మనసులోమాత్రం అది నా అదృష్టమనే అనుకున్నాను.

ప్రతిదినం ఆమెకూడా సాయంకాలం అయిదుగంటలు అయ్యేసరికి ఆఫీసునుంచి తిరిగివచ్చేది. ఎన్నో సాయంత్రాలు డాబా పిట్టగోడమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ గడిపాం. నేను వ్రాసిన బెంగాలీ కథలు తెలుగులోకి అనువదించి, ఆమెకు వినిపించేవాడిని. ఆమే వాటిని ఎంతో ఆసక్తితో వినేది. కథలో విచిత్రమైన పరిస్థితులువస్తే, కళ్ళు ఆశ్చర్యంతో

పెద్దవిచేసి చక్రాల్లా తిప్పేది. ఆమెతో కబుర్లు చెప్పుతుంటే గంటలు క్షణాల్లా దొర్లిపోయేవి రోజులు గడుస్తున్నకొద్దీ ఆమెను గురించిన వివరాలు చాలా తెలుసుకున్నాను.

ఆమెది మధ్యతరగతి కుటుంబం. ఆమె తండ్రి విశ్వనాథంగారు విజయవాడలో ఏదో మందులకంపెనీలో గుమస్తాగా పనిచేసేవారు. ఆయనకు కలిగిన అయిదుగురు పిల్లల్లోనూ రాధ పెద్దది. అతికష్టంమీద బంధువుల సాయంతో ఆమె తన ఎమ్మెస్సీ పూర్తిచేసింది. ఉద్యోగంలో చేరి తండ్రికి ఆర్థికంగా కొంత సహాయం అందించాలని ఆమె సంకల్పం. అందుకే ఎంతదూరమయినా వెనుదీయక ఉద్యోగంకోసం ఆమె కలకత్తా వచ్చింది. ఆమెలోని కార్యదీక్ష, సామర్థ్యం చూసి నాకు ఎంతో ఆశ్చర్యం కలిగేది.

మూడు నెలల సాంగత్యంలో మేమిద్దరం ఎంతో సన్నిహితులమయ్యాం. కొబ్బరిమట్టల మధ్యనుండి జారిన వెన్నెల నీడల్లో ఎన్నో మధురమయిన రాత్రులు గడిపాం.

ఇంతలో ఒక దినం ఆమెకు విజయవాడనుంచి టెలిగ్రామ్‌వచ్చింది. వాళ్ళ నాన్నగారికి సీరియస్‌గా ఉందనీ, వెంటనే బయల్దేరిరమ్మనీ దాని సారాంశం. అది చూసి రాధ భయంతో వణికిపోయింది. ఆమెకు ధైర్యం చెప్పి, ఆ రాత్రే ఆమెను మెయిల్ ఎక్కించాను. పరిస్థితులు సర్దుకున్నాక తప్పక వివాహం చేసుకుంటానని ఆమెకు మాటయిచ్చి పంపించాను. నా మనసులోని ఆనందాన్ని దోచుకొని, మెయిల్ విజయవాడవైపు పరుగు తీసింది.

*　　　*　　　*

కథ చెప్పటం ఆపి దీర్ఘంగా నిట్టూర్చాడు సుశీల్ డ్రాయరులోంచి సిగరెట్టు బయటకుతీసి ముట్టించాడు.

"తరవాత ఏమయింది?" ఆత్రంగా అడిగాడు రాజన్.

"ఏముంది? మామూలు కథే! ఆమె విజయవాడ చేరుకున్న రెండు

దినాలలో వాళ్ళ నాన్నగారు చనిపోయారట. "తప్పని పరిస్థితులలో వాళ్ళ బావతో ఆమె వివాహం నిశ్చయమయిందట! ఇక తనను మరిచిపొమ్మనీ, వేరొక స్త్రీని వివాహం చేసుకొని సుఖంగా జీవితం గడపమనీ ఉత్తరం వ్రాసింది." సునీల్ గొంతులో రాధ తనది కాలేదన్న బాధ స్పష్టంగా ధ్వనించింది. తరవాత కొద్దిసేపు మా మధ్యలో నిశ్శబ్దం రాజ్యమేలింది.

రాజన్ "పానెల్" వద్దకు వెళ్ళి "ఆసిడ్ టెంపరేచర్" చూశాడు. "గురూ! టెంపరేచర్ బాగా పెరిగిపోయింది! ఒక శాంపిల్ తీసుకు వస్తాను" అంటూ రబ్బర్ గ్లోవ్స్ చేతులకు తొడుక్కుంటున్నాడు.

నా చూపులు బయటకు మరల్చాను.

అంతే! ఉలిక్కిపడ్డాను!

"గోడౌన్‌లోని గంధకం గుట్ట అంటుకొంది. గుట్టలోంచి నీలం రంగు మంటలు నాలుకలు చాచి భయంకరంగా, కాలసర్పం పడగలా బయటకు లేస్తున్నాయి. తెల్లని పొగలు మంటల్ని చుట్టబెట్టుకొని, బరువుగా లేచి గాలిలో కదులుతున్నాయి. పావుగంట క్రితంవరకూ అక్కడ "బుల్ డోజర్" పనిచేసింది. దాని రాపిడికి గంధకం అంటుకొని ఉంటుంది. డ్రైవర్ అక్కడనుండి వెళ్ళిపోయేటప్పుడు నిప్పు చూసి వుండడు. గంధకం అంటుకోవడానికి ఎంతసేపు కావాలి?

"సునీల్! గంధకం అంటుకుంది! బయటకు వెళ్ళి "ఫైర్ వాటర్" ఓపెన్ చెయ్యండి" అని అరిచాను. వాళ్ళుముగ్గురూ హడావిడిగా కంట్రోలు రూము తలుపులు తెరుచుకొని, గోడౌన్ వైపు పరిగెత్తారు. నేను టెలిఫోన్ రిసీవర్ ఎత్తి, "ఫైర్ నెంబర్" డయల్ చేశాను. "సెక్యూరిటీ కంట్రోల్ రూమ్!" అని అవతలనుండి నాథ్ కంఠం వినిపించింది.

"నాథ్ గోడౌన్‌లోని గంధకం అంటుకుంది. వెంటనే "మాస్క్"లు పంపించండి!' అని రిసీవర్ పడేసి నేనుకూడా బయటకు పరిగెత్తాను. నేను వెళ్ళేసరికి ముగ్గురూ కలిసి రబ్బరుగొట్టాలు కనెక్టుచేసి ఉంచారు. నలుగురం కలిసి బరువైన రబ్బరు గొట్టాలను మంటలవైపు లాక్కుపు

వెళ్ళాం. ముందువైపు వెళ్ళి గొట్టం పట్టుకొని మంటల దగ్గరగా వెళ్ళాడు సుధాకర్. చూస్తుండగానే తెల్లని పొగల మధ్యలోకి చొరబడ్డాడు. అతని చొరవచూసి నాకు ఆశ్చర్యం, భయంకూడా కలిగాయి.

"సుధాకర్! "మాస్క్"లు తెమ్మని ఫోన్ చేశాను! అవి వచ్చే వరకూ పొగలమధ్యకు వెళ్ళద్దు" అని అరిచాను కాని నా మాటలు వినిపించుకోకుండా మొండి ధైర్యంతో ముందుకు సాగిపోయాడు సుధాకర్.

బయట వాతావరణంలో గాలి ఎక్కువగా ఉండటంమూలాన, మంటలు నలువైపులా వ్యాపిస్తున్నాయి. మంటలకు కరిగిపోతున్న గంధకం జరజరా పాకుతూ ఇవతలకు వచ్చేస్తూంది. ఘాటెక్కిన గంధక ధూమం అప్పటికే వాతావరణంలో బాగా వ్యాపించింది. నాకు గొంతుకంతా వెలుగు రాసినట్లయిపోయింది, దగ్గు విపరీతంగా వస్తూంది. పొగలకు కళ్ళు మంటలెక్కిపోతున్నాయి. తల తిరిగిపోతున్నట్లుంది. అంత చలి గాలిలోనూ ఒడలంతా చెమటలు ఎక్కింది.

ఇంతలో పెద్దశబ్దంతో జీప్‌వచ్చి ఆగింది. నాధ్ హడావిడిగా బయటకు దూకాడు. వెనకసీట్లోంచి నలుగురు "సెక్యూరిటీగార్డు" లు బిలబిల్లాడుతూ దిగారు.

"నాధ్! సుధాకర్ పొగల మధ్యలోకి వెళ్ళిపోయాడు! బయటకు కనిపించటం లేదు! అతనికి సహాయం చెయ్యాలి!" అన్నాడు గాభరాగా.

నాద్ ముఖానికి "మాస్క్" తగిలించుకుని, పొగల మధ్యకు పరిగెత్తాడు. ఆత్రంగా అందరం అటువైపే చూస్తూ ఉండిపోయాం. నాలుగు నిమిషాల తరవాత సుధాకర్‌ను రెండు చేతులమీదా ఎత్తుకొని బయటకు తీసుకువచ్చాడు నాధ్.

నాకు క్షణంసేపు నోటమాట రాలేదు.

సుధాకర్ శరీరం చాలాచోట్ల కాలిపోయింది. జుట్టు నుసిలా అయిపోయింది. గంధకం పచ్చగా ఒంటినిండా బెరడు కట్టినట్లు అంటుకొని ఉంది. కళ్ళు మూతలు పడివున్నాయి.

"నాథ్! ఏమిటిది?" కంపిస్తున్న స్వరంతో అడిగాడు సునీల్.

"ఏం ఫర్వాలేదు, శ్వాస ఆడుతోంది! నేను ఇతన్ని హాస్పిటల్‌కు చేరుస్తాను!" అంటూ అతన్ని జీప్ వెనక సీట్లో పడుకోబెట్టి, వేగంగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోయాడు.

క్షణం సేపు అంతా కలలా అనిపించింది. ఏదో నమ్మలేని నిజం కొద్ది క్షణాలసేపు కనులముందు భయంకరంగా వర్తించినట్లనిపించింది. ఎదురుగా పైకి వస్తున్న నీలిమంటలు మాకు మళ్ళీ కర్తవ్యాన్ని స్ఫురింప జేశాయి. తిరిగి మంటలమీదకు దండయాత్ర చేశాం. ఇరవై నిమిషాల తరవాత అగ్నిజ్వాలలు చల్లారాయి. ఆ ప్రదేశం అంతా వేడిగా, ఘాటుగా తయారయింది. నీళ్ళతో, చెమటతో మా బట్టలు తడిసి ముద్దలయ్యాయి.

ఆరిపోయిన గంధకపు గుట్ట నల్లగా, వికృతంగా తయారయింది. రాక్షసుడ్ని దహనం చేశాక మిగిలిపోయిన చితితాలూకు చిహ్నంలా ఉంది అది. మాకు సహాయం చేసిన సెక్యూరిటీ గార్డులకు కృతజ్ఞత చెప్పి పంపేశాం.

ముగ్గురం మౌనంగా కాళ్ళీడ్చుకుంటూ కంట్రోలు రూము చేరుకొని కుర్చీలలో కూలబడ్డాం. అంతవరకు మా మధ్యవున్న నాలుగోవ్యక్తి, ఆ క్షణంలో హాస్పిటల్‌లో ఉన్న సంగతి జ్ఞప్తికి వచ్చి మనసంతా వికల మయిపోయింది.

కొద్ది నిమిషాలలో ఎంతమార్పు!

"జీవితాలను శాసించే విధాత లీలలు ఎంత చిత్రంగా ఉంటాయి!" అనిపించింది.

గడియారం పదకొండూ నలభై నిమిషాలు సూచిస్తూంది. అంటే, ఇంకా ఇరవై నిమిషాలలో మా "డ్యూటీ" పూర్తి అయిపోతుంది. "రిలీవర్స్" వచ్చేవేళ అయింది. ముఖాలు కడుక్కొని, బట్టలు మార్చుకున్నాం.

"రిలీవర్స్"కి ఛార్జి అప్పచెప్పి నేను, రాజన్ కంపెనీ బస్సువైపు కదిలిపోయాం. సునీల్ స్కూటర్ మీద వెళ్ళిపోయాడు.

బస్సులో కూర్చున్నా నన్నమాటేకాని, ప్రతిక్షణం సుధాకర్ రూపమే కనులముందు మెదులుతూంది. అతడు కంపెనీలో చేరి పదిహేను దినాలు మాత్రమే అయింది. అంతలోనే ఈ ఘోరం. అతడు మొండిధైర్యంతో పొగలమధ్యకు వెళ్ళకుండా వుంటే ఈ ప్రమాదం జరిగేది కాదేమో? ప్రమాదానికి ఎంతసేపు కావాలి?

ఆ రాత్రి నాకు సరిగా నిద్ర పట్టలేదు.

* * *

గంధకం అంటుకుంటే దాన్ని ఆర్పటం సులభసాధ్యంకాదు. అది గాలిలో కలిసి లేత నీలంరంగులో అందంగా మండుతూ అతివేగంగా పక్కలకు పాకుతుంది. జ్వాలను చుట్టబెడుతూ ఘాటయిన గంధకధూమం అంతటా వ్యాపిస్తుంది. దానిని ఆర్పటానికి దగ్గరకు వెళితే, ఆ ధూమం మనలను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది.

అసత్యం కూడా చాలా సమయాలలో అతి అందంగా ఉంటుంది! అదికూడా కార్చిచ్చులా వ్యాపిస్తుంది! అది మండుతూ వుంటే వెలువడే భయంకరమయిన ధూమం "అనుమానం" అనుకుంటాను! అనుమానపు ధూమం మనిషిని ఒక్కసారిగా ఆక్రమించి, ఉక్కిరి బిక్కిరి చేసి, కర్తవ్యతావిమూఢుని చేస్తుందేమో మరి!

* * *

ఉదయం తలుపు తడుతున్న శబ్దం విని నిద్ర లేచాను. బద్ధకంగా కళ్ళు నులుముకొంటూ వెళ్ళి తలుపు తీశాను. సునీల్ భారంగా నడుస్తూ లోనికి వచ్చాడు. అతడు ఎంతో దిగులుగా వున్నాడు! ముఖం పాలిపోయి వుంది. మంచంమీద కూర్చుంటూ అన్నాడు. "సుధాకర్‌కి ఇంకా తెలివి రాలేదు! సాయంత్రంలోగా తెలివి వచ్చేస్తే ఫర్వాలేదు అంటున్నారు డాక్టర్లు" అతనిగొంతు నూతిలోంచి వచ్చినట్లు వుంది.

"రాజూ! నేను ఒక పెద్ద అపరాధం చేశాను. నిజంగా నాకూ, రాధకూ ఎటువంటి సంబంధమూలేదు! ఆమె నిప్పుకణికలాంటి మనిషి!" అన్నాడు నా ముఖంలోకి చూస్తూ. ఆ వింత ధోరణి నాకేమీ అర్థం కాలేదు.

ప్రశ్నార్థకంగా అతని ముఖంలోకి చూశాను. అతని కనుకొలకుల్లో అస్పష్టంగా రెండు నీటిబిందువులు కదలాడుతున్నాయి.

"రాజూ! నిన్నరాత్రి నేను చెప్పిన కథ అంతా కేవలం కల్పన! రాధ కలకత్తాలో మా ఇంట్లో మేడమీది గదిలో అద్దెకు వుండేది. కాని ఆమె వున్న మూడు నెలల్లోనూ ఒకటి రెండుమార్లు మాత్రమే ఆమెతో మాట్లాడగలిగాను. ఆమెను నేను ప్రేమించాను. ఒకదినం ధైర్యంచేసి ఆమెకు నా ప్రేమ వ్యక్తంచేస్తూ ఒక ప్రేమలేఖ వ్రాశాను. ఆ సాయంత్రము ఆమె నా వద్దకు వచ్చింది. "తన వివాహం వాళ్ళ బావతో నిశ్చయమయిందనీ, అనవసరంగా ఆశలు పెంచుకోవద్దనీ నన్ను హెచ్చరించింది. తరవాత వాళ్ళ నాన్నగారికి సీరియస్‌గా వుందని టెలిగ్రాం వస్తే విజయవాడ వెళ్ళిపోయింది. మరి నాకు ఆమె కనిపించలేదు. ఆమె వెళ్ళే ముందురోజున ఆమె రూంలోంచి ఆ ఫొటో దొంగిలించి నావద్ద దాచుకున్నాను! అంతే! అంతకంటే ఆమెకూ, నాకూ ఏవిధమయిన సంబంధమూ లేదు!" తరవాత అతని గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. ముఖాన్ని రెండు చేతులమధ్య దాచుకొని ఏడ్చేశాడు. నాకు పరిస్థితి అంతా అయోమయంగా ఉంది.

సునీల్‌లో ఇటువంటి వింతప్రవర్తన నేను ఎప్పుడూ చూడలేదు.

ఎల్లప్పుడూ తాను నవ్వుతూ, ఎదటివారిని నవ్విస్తూ హుషారుగా వుండే సునీల్ ఈ దినం ఇలా అయిపోయాడేమిటి?

అతనిలో దుఃఖాన్ని చూడటం నాకు ఇదే మొదటిసారి.

అతని ప్రవర్తన నాకు అంతుపట్టలేదు.

"సునీల్! అసలు విషయమేమిటో నాకు అర్థంకావటం లేదు!" అన్నాను.

"ఏం చెప్పను? ఎలా చెప్పను? నిన్న రాత్రి షిఫ్టు అయిపోయాక ఈ ప్రమాదం గురించి చెప్పేందుకు సుధాకర్ ఇంటికి వెళ్ళాను. అతని భార్య తలుపు తీసింది. ఒక్కసారి షాక్ తిన్నట్లు అయ్యాను. ఆముఖాన్ని ఆ అందమైన ముఖాన్ని నేను గుర్తు పట్టాను! ఆమె!....ఆమె ఎవరో కాదు!...."

అతడు అంతవరకూ చెప్పిందేదో నాకు పూర్తిగా అర్థమయింది.

ఆ తరవాత మాట్లాడుతున్నది మాత్రం చెవులకు వినిపించలేదు. పిచ్చిగా శూన్యంలోకి చూస్తూ వుండిపోయాను. *

(1969 ఆంధ్రసచిత్ర వారపత్రిక )